సాక్షి నారాయణపేట

శనివారం : 29 : జూన్ : 2024



జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో

జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద పూర్తిగా తగ్గుముఖం పట్టింది.

వివరాలు 8లో ▸



ఉద్యమంతోనే తెలంగాణ..

ఉద్యమంతోనే ప్రత్యేక రాష్ట్రం సాధ్యమైందని ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి పేర్కొన్నారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.2 /24.7

వాతావరణం

ఆకాశం రోజంతా మేఘావృతమై ఉంటుంది. ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని సీఎస్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి తరగతులు బోధించుటకు ఖాళీగా ఉన్న సబ్జెక్టులలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ నారాయణగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. స్టాటిస్టిక్స్, ఇంగ్లీష్, ఉర్దూ, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్‌సైన్స్, బాటనిలలో ఒక్కొక్కరు, తెలుగు, కంప్యూటర్‌సైన్స్‌లో ఇద్దరు చొప్పున అవకాశం ఉంటుందని తెలిపారు. పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు జూలై 1వ తేదీలోగా కళాశాలలో నేరుగా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి



నారాయణపేట: మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పర్ణికారెడ్డికి వినతిపత్రం అందజేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు బాల్‌రామ్ మాట్లాడుతూ పారిశుద్ధ్య, ఎలక్ట్రిషన్, వాటర్ సప్లై తదితర విభాగాలలో పని చేస్తున్న కార్మికులతో శ్రమ దోపిడీ చేసిందన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయాలని ఎమ్మెల్యేను కోరగా.. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో సాయిలు, వనిత, ఉమా, పాండు ,కేశవులు, గోపి, వెంకటేష్ అశోక్ తదితరులు ఉన్నారు.

పదవుల వేలం..?

- గద్వాల మార్కెట్ చైర్మన్ పదవి రూ.1.75 కోట్లు..
- సోషల్ మీడియాలో పోస్టులు వైరల్

గద్వాల రూరల్: వేలం పాటలను కూరగాయల మార్కెట్‌లోనో.. సంతబజారులోనో చూస్తుంటాం. కానీ ఇక్కడ రెండింటికి భిన్నంగా రాజకీయ వేలం పాట సాగుతోంది. అధికార పార్టీలో నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న వారు చాలామందే ఉండగా.. పార్టీలో సీనియార్టీ, పార్టీ అభివృద్ధి కోసం పనిచేసే వాళ్లకు కేటాయించడం సహజం. కానీ గద్వాలలో పదవుల పంపకాలు మాత్రం ఇందుకు పూర్తి భిన్నంగా కొనసాగుతున్నాయి. పదవులను వేలంపాటలో పాడుతూ ఎవరు అధిక ధరలకు పాట పాడుతారో వారికే పదవులు వరిస్తాయనే తరహాలో జరుగుతుంది. ఈక్రమంలోనే గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్‌కు రూ.1.75కోట్లు, వైస్‌చైర్మన్‌కు రూ.18లక్షలు పలికినట్లు సామాజిక మీడియాలో వచ్చిన పోస్టులు జిల్లాలో హాట్ టాపిక్‌గా మారాయి. ఎమ్మెల్యే తరువాత అంతటి ప్రాధాన్యత, స్థాయి ఉన్న వ్యవసాయ మార్కెట్‌యార్డు పోస్టుకు వేలం పాట తరహాలో ధర నిర్ణయించడంపై పార్టీలోని సీనియర్ నాయకులు మండిపడుతున్నారు. ఈ తరహా అమ్ముకునే రాజకీయాలు గతంలో ఎన్నడూ లేవని ఇది కొత్త సంప్రదాయానికి తెర లేపారంటూ తీవ్ర అసంతృప్తిని వెళ్లగక్కుతున్నారు.

అధిష్టానం దృష్టికి..

అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీలో వర్గవిబేధాలు చోటుచేసుకుని ఒకరిపై మరొకరు దాడులు చేసుకునే వరకు వెళ్లింది. ఈ క్రమంలో నియోజకవర్గంలో ముఖ్య నాయకుడు నామినేటెడ్ పదవులు కూరగాయల మార్కెట్‌లో వేలంపాట మాదిరి విక్రయించుకోవడంపై మరో ప్రధాన నాయకుడి వర్గం మండిపడుతున్నారు. పార్టీకి కష్టపడి పని చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వకపోవడాన్ని నేరుగా అధిష్టానం దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.



మార్కెట్ పీఠం దక్కేదెవరికో?

- జిల్లాలో నారాయణపేట, మక్తల్, కోస్గి వ్యవసాయ మార్కెట్ యార్డులు
- పదవుల కోసం పైరవీలకు పదునుపెట్టిన ఆశావహులు
- పేటలో జనరల్ రిజర్వు.. మక్తల్‌లో జనరల్ మహిళ
- కోస్గిలో ఎస్సీ జనరల్

నారాయణపేట: రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ మార్కెట్లకు త్వరలో పాలకవర్గాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టనుండడంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. జిల్లాలోని నారాయణపేట, మక్తల్, కోస్గి మూడు వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో పాలకవర్గాలకు సారథ్యం వహించే చైర్మన్ పదవుల కోసం కాంగ్రెస్ అధికార పార్టీలో తీవ్ర పోటీ నెలకొంది. జిల్లాలోని ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకుంటూ అమాత్యుల ఆశీస్సులను పొంది మార్కెట్ కమిటి పీఠం దక్కించుకునేలా ఒకరిని మించి ఒకరు తెర వెనుక వ్యూహంతో పావులు కదుపుతున్నారు. వారం రోజుల వ్యవధిలోనే నూతన మార్కెట్ పాలకవర్గాలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసే అవకాశం ఉందని విశ్వసనీయ సమాచారం.

కసరత్తు షురూ..

ప్రత్యేక రాష్ట్రం ఏర్పాడ్డక తొలిసారిగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇది వరకు ఉన్న పాలక వర్గాలను జనవరిలోనే రద్దు చేసిన విషయం విధితమే. వ్యవసాయ మార్కెట్లకు పాలక వర్గాలను నియమించేందుకు జనవరిలోనే ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. అయితే పార్లమెంట్ ఎన్నికలు రావడంతో తలనొప్పి ఎందుకని మార్కెట్ పాలకవర్గాలను ఏర్పాటు చేసేందుకు అసక్తి చూపలేదు. పార్లమెంట్ ఎన్నికలు అయిపోయి ఫలితాలు వెలువడి మూడు వారాలు దాటింది. మార్కెట్ పాలక వర్గాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నారాయణపేట వ్యవసాయ మార్కెట్ పీఠం ఈ సారి జనరల్ కావడంతో ఏవరికి దక్కుతుందోననో ఆశవాహుల్లో ఉత్కంఠ నెలకొంది. పేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి మార్కెట్ పీఠంపై అశావహుల్లో ఒకరికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. నారాయణపేట మార్కెట్ పాలక వర్గం చైర్మన్, వైస్ చైర్మన్, 12 మంది డైరెక్టర్లు నియమించేందుకు నివేదికలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

మక్తల్‌లో ఆదృష్టవంతురాలు ఎవరో..

మక్తల్ మార్కెట్‌యార్డులో ఇది వరకు మూడు సార్లు బీసీలకు రిజర్వేషన్ కావడంతో రెండు పర్యాయాలు నర్సింహగౌడ్, ఒక పర్యాయం రాజేశ్వర్‌గౌడ్ మార్కెట్‌చైర్మన్లుగా కొనసాగారు. ఈ సారి జనరల్ మహిళ కావడంతో మాజీ జడ్పీటీసీ లక్ష్మారెడ్డి, మక్తల్ మాజీ ఉప సర్పంచ్ కట్ట సురేశ్, మాగనూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆనంద్‌కుమార్‌గౌడ్, మత్స్యశాఖ జిల్లా మాజీ అధ్యక్షులు కోళ్ల వెంకటేశ్, మక్తల్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గణేశ్, బిల్డర్ కావాలి తాయప్ప వారి సతీమణులకు అవకాశం కల్పించాలని ఎమ్మెల్యేను కోరినట్లు తెలుస్తోంది. అయితే జనరల్ మహిళ కావడంతో దాదాపు మాజీ జడ్పీటీసీ లక్ష్మారెడ్డి సతీమణికి ఖరారు అయ్యే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో చర్చ కొనసాగుతుంది.

సీఎం ఇలాఖాలో..

కోస్గి మార్కెట్ యార్డులో ఇదివరకు జనరల్ రిజర్వేషన్‌లో మద్దూర్‌కు చెందిన వీరారెడ్డి కొనసాగారు. అయితే ఇప్పుడు రోస్టర్ పద్ధతిలో ఎస్సీ జనరల్ రిజర్వేషన్ కావడంతో ఆశావహుల్లో మద్దూర్ మండలం నుంచి సుభాష్, కనకప్ప, కోస్గి మండలం మాజీ జడ్పీటీసీ రాస్వాం బాలరాజు సీఎం ఇలాఖాలో వెవరికి పీఠం దక్కుతుందో వేచిచూడాల్సిందే మరి. దీంతో జిల్లాలోని నారాయణపేట, మక్తల్, కోస్గి మార్కెట్ పాలకవర్గాలు ఏర్పాటుకు ఆశావాహులు కోటి ఆశలతో ఎవరిని వరిస్తుందోనని ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు.

ఫీడ్ బ్యాక్.. అంతా ఓకే

నియోజవర్గ స్థాయిలో ఎమ్మెల్యే తర్వాత మరో పదవి ఏదైనా ఉందంటే నామినేటెడ్‌గా నియమించే మార్కెట్ పదవి. ఆ పదవిలో ఉన్నవారు నియోజకవర్గంలో ప్రభావితం చేసే పరిస్థితి ఉంటుంది. మార్కెట్ పరిధిలోని దామరగిద్ద, నారాయణపేట, ధన్వాడ, మరికల్, నారాయణపేట టౌన్‌లోని కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు, ముఖ్య నాయకులు, ముఖ్య కార్యకర్తలతో తమదైనశైలిలో ఆశావహుల్లోని పేర్లను ప్రస్తావిస్తూ వెవరికి మార్కెట్ చైర్మన్ పదవి కట్టబేడితే బావుంటనేది ఎమ్మెల్యేతో పాటు డీసీసీ మాజీ అధ్యక్షులు ఫీడ్ బ్యాక్ తీసుకొని జల్లడ పట్టినట్లు తెలుస్తోంది. అయితే నారాయణపేట నుంచి ఆశించిన వారిలో కాంగ్రెస్ పార్టీ యువజన జిల్లా అధ్యక్షుడు కోట్ల రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సదాశివారెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. వైస్ చైర్మన్ పదవి పేట పట్టణానికి చెందిన ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన కొనంగేరి హన్మంతు పేరు ఖరారు అయినట్లేనని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతుంది. మార్కెట్ చైర్మన్‌తో పాటు, వైస్ చైర్మన్, డైరెక్టర్లుగా నియమించే వారి నుంచి ఆధార్‌కార్డు, కులధృవీకరణ పత్రం, భూమి ధృవీకరణ పత్రాలను స్వీకరించినట్లు తెలుస్తోంది.

మూడేళ్ల గడువు

నూతన విధానాన్ని అనుసరించి పాలక వర్గ అధ్యక్ష పదవికి రిజర్వేషన్లను వర్తింపజేస్తున్న సంగతి తెలిసిందే. గతంలో కమిటి గడువు మార్కెట్ పదవీ కాలాన్ని ఏడాది, ప్రత్యేక అభ్యర్థనతో మరో అరునెలల పాటు పెంచే అవకాశం ఉండేది. ఆరు నెలలు దాటిన తర్వాత మరో ఆరు నెలలు ఎమ్మెల్యే సిఫారసు చేస్తే పొడగించే అవకాశంతో రెండు సంవత్సరాలు పాలకవర్గం కొనసాగింది. కొత్త పాలక వర్గం పదవీ కాలం రెండేళ్లు ఉంటుంది. మరో ఏడాది గడువు పొగడించే అవకాశాన్ని కల్పించారు. గతంలో అధ్యక్షుడు సహా 14 మంది డైరెక్టర్లు ఉండగా మార్పును అనుసరించి 18 మందితో కమిటీ ఏర్పడింది. గతంలో ఏడాది ఉండే పాలకవర్గ పదవీ కాలాన్ని రెండేళ్లకు పెంచారు. తాజాగా ఆరు నెలల చొప్పున రెండు సార్లు పదవీ కాలాన్ని పెంచాలని నిర్ణయం తీసుకుంది. దీంతో ఇప్పుడు వచ్చే పాలకవర్గాల పదవీ కాలం మూడేళ్ల వరకు కొనసాగనుంది.

పీయూకు మహర్దశ



- పీఎం ఉష స్కీం ద్వారా రూ.100 కోట్ల పనులకు గ్రీన్‌సిగ్నల్
- నూతన ఇంజినీరింగ్, లా కళాశాలల నిర్మాణానికి అనుమతులు
- కొత్త భవనాలకు రూ.78 కోట్లు, మరమ్మతుకు రూ.3.6 కోట్లు..
- ల్యాబ్‌లో పరికరాలకు రూ.14.26 కోట్ల కేటాయింపు
- ఆడిటోరియం, ఇండోర్‌స్టేడియం, స్విమ్మింగ్‌పూల్స్, ఆస్పత్రి సైతం నిర్మాణం

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యనందించాలనే లక్ష్యంతో ఏర్పాటైన పాలమూరు యూనివర్సిటీ (పీయూ)లో ఇన్నాళ్లు సమస్యలు పేరుకుపోయాయి. యూనివర్సిటీ ఏర్పాటై 16 ఏళ్ల గడుస్తున్నా కనీస వసతులు కరువయ్యాయి. ఏ విభాగాన్ని పరిశీలించినా, ఎక్కడ చూసినా సమస్యలే కనిపించేవి. విజ్ఞాన భాండాగారంగా ఉండాల్సిన పీయూ లైబ్రరీలో సైతం అరకొర పుస్తకాలే ఉన్నాయి. అయితే ఈ సమస్యలన్నింటికీ స్వస్తి పలికేందుకు కేంద్రప్రభుత్వం పీఎం ఉషా (ప్రధాన మంత్రి ఉచ్ఛతర్ శిక్షా అభియాన్) కార్యక్రమం ద్వారా ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.100 కోట్లను కేటాయించింది. ఈ నేపథ్యంలో నిధులను విడుదల చేస్తూ వివిధ విభాగాలలో వినియోగించేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఇందుకు సంబంధించిన కాలేజీ గేట్ ఎడ్యుకేషన్, రూసా ప్రాజెక్టు అధికారి వెంకటేషం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం కేటాయించిన రూ.100 కోట్లలో రూ.78 కోట్లు నూతన భవనాల నిర్మాణం కోసం, గతంలో నిర్మించిన భవనాల మరమ్మతుల కోసం రూ.3.60 కోట్లు, పరిశోధనలను ప్రోత్సహించేందుకు ప్రయోగశాలలో పరికరాల కోసం రూ.14.26 కోట్లు, అధ్యాపకుల రీసెర్చ్, బోధన, శిక్షణ తదితర వాటి కోసం రూ.3.22 కోట్లను కేటాయించారు.

లా, ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణం

పాలమూరు యూనివర్సిటీలో లా, ఇంజినీరింగ్ కళాశాలలను ఏర్పాటు చేయాలని విద్యార్థి సంఘాలు కొన్నేళ్లుగా డిమాండ్ చేస్తున్నాయి. ఈ క్రమంలో ఈ కళాశాలలకు అకాడమిక్, అడ్మినిస్ట్రేషన్, హాస్టల్ భవనాలను నిర్మించేందుకు ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం అనుమతించింది. ఇక విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ కోసం ఇంక్యూబేషన్ సెంటర్, 2 వేల మంది సీటింగ్ కెపాసిటీతో ఆడిటోరియం నిర్మాణం, 20 పడకలతో ప్రత్యేక ఆస్పత్రి, వనపర్తి పీజీ సెంటర్‌లో హాస్టల్ భవనం, ఇండోర్ స్టేడియం, జిమ్, యోగా, బాలబాలికలకు ప్రత్యేకంగా స్విమ్మింగ్ పూల్స్‌ను నిర్మించనున్నారు. ప్రస్తుత లైబ్రరీలో మరింత విస్తరించడం, ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సులను ప్రారంభించనున్నారు. రూ.78 కోట్లు కేవలం నూతన భవనాలకే కేటాయించగా.. వీటిని ఆయా భవనాల నిర్మాణానికి అంచనాల ఆధారంగా నిధులివ్వనున్నారు. ఈ పనులను ఈడబ్ల్యూఐడీసీతో పాటు ఇతర ఏజెన్సీల ద్వారా వెంటనే చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది.

ఇదో కీలక మైలురాయి..



ప్రభుత్వం రూ.100 కోట్ల పనుల కోసం పంపిన ప్రతిపాదనలకు ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పాలమూరు యూనివర్సిటీకి ఇదో కీలక మైలురాయి. లా, ఇంజినీరింగ్ కళాశాలల నిర్మాణానికి కూడా నిధుల కేటాయించారు. వీటితో పాటు పీయూలో అవసరం ఉన్న అన్ని నిర్మాణాలను యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఉమ్మడి పాలమూరు జిల్లాలో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తాం.

– మధుసూదన్‌రెడ్డి, పీయూ రిజిస్ట్రార్

పరిశోధనలతో మరింత పటిష్టం



యూనివర్సిటీలో రూ.100 కోట్లతో పనులు చేపట్టేందుకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వడం గొప్ప విషయం. కొత్త భవనాలతో పాటు పరిశోధనలకు కూడా అధికంగా నిధులు కేటాయించారు. ఉమ్మడి జిల్లా లోని విద్యార్థులు ఎంతో మేలు జరుగుతుంది. ప్రయోగశాలలో అధునాతన పరికరాలను ఏర్పాటు చేయనున్నారు.

– రాజ్‌కుమార్, పీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్

నాణ్యమైన విద్య అందుతుంది



యూనివర్సిటీకి ప్రభుత్వం రూ.100 కోట్ల నిధులు విడుదల చేయడం గొప్ప విషయం. విద్యార్థులకు అవసరమైన ఇండోర్ స్టేడియం, హాస్పిటల్, రీసెర్చ్ భవనాలను సైతం నిర్మించనున్నారు. వసతులు మెరుగుపర్చడం ద్వారా పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు అవకాశం దొరుకుతుంది.

– చంద్రకిరణ్, పీయూ ప్రిన్సిపల్

రెండేళ్ల నుంచి ఉద్యమం



పీయూలో లా, ఇంజినీరింగ్ కళాశాలలను ఏర్పాటు చేసేందుకు రెండేళ్ల నుంచి ఉద్యమం చేశాం. ప్రభుత్వం అందుకు సంబంధించి గతంలో ఏర్పాటుకు ప్రతిపాదనలు తీసుకుంది. ప్రస్తుతం రెండు కళాశాలల నిర్మాణానికి అనుమతించడం గొప్ప విషయం. ఉమ్మడి జిల్లాలో ఈ కళాశాలలు అందుబాటులో లేవు. ఇవి ఏర్పాటు చేస్తే ప్రతిభ ఉన్న పేద విద్యార్థులు క్యాంపస్‌లో చదివేందుకు అవకాశం లభిస్తుంది.

– రాము, పీయూ జేఏసీ చైర్మన్

ల్యాబ్‌లలో అధునాతన పరికరాలు



యూనివర్సిటీలో వివిధ సైన్స్ ల్యాబ్‌ల్లో అధునాతన పరికరాలను ఏర్పాటు చేసేందుకు రూ.14.26 కోట్లు కేటాయించారు. ఇందులో ట్రాన్స్‌మిషన్ ఎలక్ట్రో మైక్రోస్కోప్‌కు రూ.2 కోట్లు, ఎక్స్‌రే ఫ్రొటోఎలక్ట్రాన్ స్పెక్ట్రోమీటర్‌కు రూ.1 కోట్లు, ఫ్లోరోసెన్స్ మైక్రోస్కోప్ రూ.20 లక్షలు, ఫ్లాష్ క్రొమెటోగ్రఫీ కోసం రూ.25 లక్షలు, హెచ్‌పీఎల్‌సీ(3)కి రూ.60 లక్షలు, ఎఫ్‌టీఐఆర్(2)కు రూ.40 లక్షలు, హైస్పీడ్ టేబుల్ ప్రెస్ మిషన్ రూ.15 లక్షలు, రోటో ఎవాపరేట్ విత్ చిల్లర్(4)కు రూ.5 లక్షలు, హెచ్‌టీపీసీఎల్– 2కు రూ.25 లక్షలు, సెంట్రిఫ్యూజ్ రూ.25 లక్షల, కోల్డ్‌స్టోరేజ్, టెంపరేచర్ మానిటరింగ్ రూ.1 కోట్లు, జెల్ డాక్యుమెంటేషన్ విత్ పీసీఆర్ 2డీ జెల్ ఎలక్ట్రోలసిస్ రూ.1.5 కోట్లు, యూవీ స్పెక్ట్రోమీటర్(6)కు రూ.6 లక్షలు, ఎన్‌ఎంఆర్ రూ.1.6 కోట్లు, స్కానింగ్ ఎలక్ట్రాన్ మైక్రోస్కోప్ రూ.1 కోటి, మోసబీయర్ స్పెక్ట్రోమీటర్ రూ.80 లక్షలు, పవర్ సప్లయ్ సిస్టం రూ.12 లక్షలు, అధునాతన 13 జనరేషన్ కంప్యూటర్లు (200)కు రూ.2 కోట్లు కేటాయించారు.

మెరుగైన వైద్యం అందించాలి

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో నార్మల్ డెలివరీలు పెరగాలి
- కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్యం అందించేలా కృషి చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వైద్య శాఖ అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఎన్ని పీహెచ్‌సీలు, ఎంతమంది మెడికల్ ఆఫీసర్లు, ఇన్‌చార్జ్ మెడికల్ ఆఫీసర్లు ఉన్నారని ఆరా తీశారు. అలాగే, అన్ని ఆస్పత్రుల్లో సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయా లేదా అని అడగడంతోపాటు 9 గంటలకు బయోమెట్రిక్ రిపోర్ట్ ఉండాలన్నారు. రోగులతో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. ఆస్పత్రిలో నార్మల్ డెలివరీ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పీహెచ్‌సీలో నార్మల్ డెలివరీ శాతం పెంచాలన్నారు. విద్యార్థులకు ఐరన్ మాత్రలు ప్రతి గురువారం వేయాలని, అనీమియా జూన్‌లో రిపోర్ట్ ఎంత ఉందని కలెక్టర్ ఆరా తీశారు. అనంతరం నార్మల్ డెలివరీలలో రాష్ట్రంలోనే జిల్లా రెండవ స్థానంలో ఉందని డీఎంహెచ్‌ఓ సౌభాగ్య లక్ష్మి వివరించారు. అదేవిధంగా అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్ మాట్లాడుతూ.. సబ్ సెంటర్ల వారీగా ఎన్ని పాఠశాలలు ఉన్నాయని, ప్రతి గురువారం ఒక ఐరన్ ట్యాబ్లెట్ విద్యార్థులకు లంచ్ తర్వాత అందజేయాలన్నారు. ప్రతి గురువారం ఏఎన్‌ఎం ఆశా వర్కర్లు పాఠశాలల్లో మాత్రల పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు.

కొడంగల్‌లో అభివృద్ధి పనులు వేగవంతం

కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి కడా కింద ఇప్పటికే మంజూరైన నిధులతో పనులను ప్రారంభించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులకు సూచించారు. శుక్రవారం కొడంగల్ కడా కార్యాలయంలో కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి మంజూరైన నిధులతో చేపట్టాల్సిన పనులపై వికారాబాద్ కలెక్టర్ ప్రతిక్ జైన్‌తో కలిసి నారాయణపేట, వికారాబాద్ జిల్లాల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి పనులను అధికారులు తమ శాఖలకు నిర్దేశించిన పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలన్నారు. మంజూరు అయిన పనులకు టెండర్ల ప్రక్రియను వేగవంతం చేసి పనులకు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. రోడ్ల విస్తరణ, రోడ్ల బలోపేతానికి సంబంధించి పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బీ శాఖల ఇంజినీర్లు ప్రత్యేక దృష్టి సారించాలని, వివిధ కాలేజీల నిర్మాణం నిమిత్తం భూసేకరణ చేపట్టాలని, కొడంగల్‌లో ప్రభుత్వ ఆసుపత్రుల భవనాల నిర్మాణాల నమూనాలు, వైద్యుల నియామకానికి ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. అనంతరం కొడంగల్ నియోజకవర్గంలోని కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సమీక్షా సమావేశంలో కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, టీ ఎస్‌ఈడబ్ల్యూఐడిసి, ట్రైబల్ వెల్ఫేర్, టీఎస్‌ఎంఐడిసి, మిషన్ భగీరథ ఈఈలు, డిసిఎచ్ ఎస్ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



దామరగిద్ద పీహెచ్‌సీలో వైద్యం కోసం వచ్చిన వారితో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

విధుల్లో నిర్లక్ష్యం.. షోకాజ్ నోటీస్ జారీ

నారాయణపేట(దామరగిద్ద): విధుల్లో నిర్లక్ష్యం వహించిన వైద్యాధికారికి కలెక్టర్ సిక్తా పట్నాయక్ షోకాజ్ నోటీసు జారీ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రికి వచ్చిన ప్రజలతో సేవలు ఎలా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. అయితే, కలెక్టర్ ఉదయం 9:40 నుంచి 10:10 వరకు ఆస్పత్రిలో ఉండగా.. వైద్యాధికారి నవనీత రాకపోవడంతో సమయపాలన పాటించడం లేదంటూ షోకజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

పోలీస్ ఉద్యోగం మహోన్నతమైనది

నారాయణపేట: సమాజంలో ఎన్ని సమస్యలు ఎదురైనా వాటిని పరిష్కరిస్తూ శాంతియుత వాతావరణంలో ప్రజలు జీవించే విధంగా సేవలందించే అవకాశం పోలీస్ ఉద్యోగం ద్వారా లభిస్తుంద ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. శుక్రవారం పదవీ విరమణ పొందుతున్న అడిషనల్ ఎస్పీ నాగేంద్రుడు, కంట్రోల్ రూం ఎస్ఐ వేమన్న సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలతో మమేకం అవుతూ పోలీసుల గౌరవం పెరిగేలా సమజాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. విధి నిర్వహణలో ఎన్నో ఆటుపోట్లు, ఇబ్బందులు ఎదురైనా రాత్రి, పగలు నిత్యం ప్రజల కోసం పని చేయడంలో కలిగే సంతృప్తి అలాంటి వాటన్నింటిని మర్చిపోయేలా చేస్తుందన్నారు. అందరికి స్ఫూర్తివంతంగా నిలవాలని సూచించారు. అడిషనల్ ఎస్పీ నాగేంద్రుడు 32 సంవత్సరాలు, ఎస్ఐ వేమన్న 41 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకొని పదవీ విరమణ పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రియాజ్, నాగర్‌కర్నూల్ అదనపు ఎస్పీ భరత్, డీఎస్పీ నల్లపు లింగయ్య, సిఐలు శివ శంకర్, రామ్ లాల్, రాజేందర్‌రెడ్డి, సోమ నర్సయ్య, నరసింహ పాల్గొన్నారు.

వినూత్నంగా అభిమానం చాటి..

ఇదిలాఉండగా, ఏఎస్పీ నాగేంద్రుడు, పోలీస్ కంట్రోల్‌రూం ఎస్ఐ వేమన్న పదవీ విరమణ నేపథ్యంలో వారిపై ఉన్న అభిమానాన్ని పోలీసు సిబ్బంది వినూత్నంగా చాటారు. సన్మాన సభ అనంతరం వారు ఇరువురిని ఓపెన్‌టాపులో పూలు చల్లుతూ.. జీపునకు తాళ్లు కట్టి రథోత్సవం మాదిరి ముందుకు లాగారు.



పదవీ విరమణ పొందిన ఏఎస్పీ నాగేంద్రుడు, ఎస్ఐ వేమన్నని ఓపెన్ టాపు జీపుపై ఉంచి.. తాళ్లతో జీపును లాగుతున్న పోలీసు సిబ్బంది

తైబజార్ వేలంతో రూ.4.30లక్షల ఆదాయం

మరికల్: గ్రామ పంచాయతీ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన మరికల్ తైబజార్ వేలం రూ.4.30 లక్షలు పలికింది. పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్‌రెడ్డి సర్కార్ పాటతో వేలంను ప్రారంభించగా.. నల్గురు వ్యక్తులు ఒక్కొక్కరు రూ.50 వేల చొప్పున డిపాజిట్ చేసి వేలం పాటలో పాల్గొన్నారు. ఈక్రమంలో మరికల్‌కు చెందిన కొండేటి తిర్మలయ్య రూ. 4.30 లక్షలకు వేలం పాడి తైబజార్‌ను దక్కించుకున్నాడు. మూడు విడతలుగా పంచాయతీకి నగదు చెల్లించాలని కార్యదర్శి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పావని, ప్రత్యేక అధికారి నరేందర్, మాజీ సర్పంచ్ గోవర్ధన్, వీరన్న, హరీష్, చెన్నయ్యలు పాల్గొన్నారు.



తైబజార్ వేలం నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్‌రెడ్డి

క్లుప్తంగా

భార్య చేతిలో భర్త హతం

- వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని..



శివశంకర్(ఫైల్)

నాగర్‌కర్నూల్ రూరల్: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని, కట్టుకున్న భర్తను భార్య కడతేర్చింది. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. సీఐ కనకయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని 15వ వార్డుకు చెందిన శివశంకర్, శివలీల భార్యాభర్తలు. శివశంకర్ హమాలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో భార్యాభర్తలు ఇద్దరూ తరచూ గొడవ పడుతుండేవారు. ఈ క్రమంలోనే గురువారం రాత్రి ఇద్దరూ తాగి గొడవ పడ్డారు. వెంటనే భార్య, భర్తపై పక్కనే ఉన్న రాళ్లు, కర్రలతో దాడి చేసి చంపేసింది. ఈ విషయాన్ని ఇంటి పక్కన ఉన్నవారు శుక్రవారం ఉదయం పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. శివలీలను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు స్థానికులు తెలియజేశారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి



విజయశ్రీ (ఫైల్)

అచ్చంపేట: అమ్రాబాద్ మండలం తుర్కపల్లికి చెందిన పరశురాములు, రేణుక కుమార్తె విజయశ్రీ (14) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వారి కథనం మేరకు.. విజయశ్రీ బల్మూర్‌లోని కస్తూర్బా విద్యాలయంలో 9వ తరగతి చదివేది. 13 రోజుల కిందట పాఠశాలకు వెళ్లమని సోదరుడు మందలించడంతో మనస్తాపానికి గురై పురుగుమందు (గడ్డి మందు) తాగింది. గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే అమ్రాబాద్ సివిల్ ఆస్పత్రికి అటు నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. చిన్నాన్న కుంచమోళ్ల మూర్తి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు అమ్రాబాద్ పోలీసులు తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యం

నవాబుపేట: వ్యక్తి అదృశ్యమైన ఘటనలో కేసు నమోదైనట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గురుకుంటకి చెందిన చింత కింది యాదయ్య(45) కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో కుటుంబంతో పాటు ఉంటున్నాడు. ఈ నెల 4న గ్రామంలో బంధువు అంత్యక్రియలకు వచ్చి.. తిరిగి హైదరాబాద్ వెళ్తున్నట్లు చెప్పి బయలు దేరాడు. అప్పటి నుంచి కనిపించకుండా పోయాడు. దీంతో శుక్రవారం అతడి సోదరుడు ఆనంద్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

హన్మసానిపల్లిలో మహిళ..

హన్మసానిపల్లికి చెందిన ఓ మహిళ(35) ఈ నెల 26న అర్ధరాత్రి ఇంట్లో చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. కాగా ఆమె కారుకొండకి చెందిన లింగంతో తరచూ మాట్లాడేదని.. అతడిపై అనుమానం ఉందని ఆమె భర్త శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

కంకర టిప్పర్ బోల్తా : నిలిచిన రాకపోకలు



బోల్తాపడిన టిప్పర్‌ను తీస్తున్న ఇటాచీలు

మహమ్మదాబాద్: ప్రమాదవశాత్తు కల్వర్టు వద్ద కంకర టిప్పర్ బోల్తా పడి రోడ్డుపై రాకపోకలు నిలిచిన సంఘటన మహమ్మదాబాద్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ చించోళి హైవే రోడ్డు పనులు చేస్తున్న సమయంలో బుధవారం ఓ కంకర టిప్పర్ లోడుతో మహమ్మదాబాద్ రామాలయం వద్ద ఏర్పాటు చేస్తున్న కల్వర్టు వద్దకు వచ్చింది. ప్రమాదవశాత్తు టిప్పర్ ఓవైపు ఒరిగి కల్వర్టు వద్ద పడిపోయింది. డ్రైవర్ క్షణాల్లో ప్రాణాలతో బయటపడ్డాడు. టిప్పర్‌ను తీయడానికి రెండు ఇటాచీలు రాగా.. దాన్ని తొలగించేందుకు సుమారు గంటన్నరకు పైగా సమయం పట్టింది. దీంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. చివరకు ఇటాచీల సాయంతో టిప్పర్ వాహనాన్ని తీయడంతో ప్రయాణికులు వెళ్లిపోయారు.



రోడ్డుకు ఇరువైపులా నిలిచిన వాహనాలు

ప్రతి ఎకరాకు సాగునీరు



పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి, కలెక్టర్ బదావత్ సంతోష్, ఇంజినీర్లు

- కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద నీరందించాలి
- పాలమూరు-రంగారెడ్డి పనులు త్వరగా పూర్తి చేయండి
- నార్లాపూర్ వద్ద పాలమూరు ప్రాజెక్టు పనులను పరిశీలించిన మంత్రి జూపల్లి కృష్ణారావు
- పనుల పురోగతిపై ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష

సాక్షి, నాగర్‌కర్నూల్: పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును త్వరగా పూర్తిచేయడంతో పాటు కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా పూర్తిస్థాయిలో రైతులకు సాగునీరు అందించాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. కృష్ణాతీరంలోని నార్లాపూర్ వద్ద శుక్రవారం పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులతో పాటు కల్వకుర్తి ఎత్తిపోతల పథకం మొదటి లిఫ్టు, మిషన్ భగీరథ పంపుహౌజ్, రిజర్వాయర్‌ను సందర్శించారు. కలెక్టర్ బదావత్ సంతోష్‌తో కలసి పాలమూరు ప్రాజెక్టు పురోగతిపై ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రాజెక్టు నిర్మాణం ఎంత ముఖ్యమో ప్రతీ రైతుకు పొలంలోకి సాగునీటిని చేర్చడం అంతే ముఖ్యమని చెప్పారు. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టును వేగంగా పూర్తిచేసి, కృష్ణాజలాల వాటాను సద్వినియోగం చేసుకోవాలని వెల్లడించారు. చివరి ఆయకట్టు రైతుకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

కాల్వలు లేకుండా ప్రాజెక్టు నిర్మించారు..

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును గత ప్రభుత్వం హడావుడిగా ప్రారంభించిందని మంత్రి జూపల్లి వ్యాఖ్యానించారు. ఒక్క మోటారును మాత్రమే ప్రారంభించడంతో నీరు వంద మీటర్లు కూడా ముందుకు సాగలేదని చెప్పారు. 12 లక్షల ఎకరాలకు నీరందించే లక్ష్యంతో ప్రారంభించిన ప్రాజెక్టుకు ఇప్పటివరకు ఒక్క కాల్వ నిర్మాణం కూడా మంజూరు కాలేదని తెలిపారు. నార్లాపూర్ నుంచి ఏదుల రిజర్వాయర్ వరకు నీటిని తరలించేందుకు కాల్వ నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు. ఇందుకు సుమారు నాలుగు నెలల సమయం పడుతుందని చెప్పారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి ప్రాజెక్టు వేగంగా పూర్తిచేసేందుకు కృషి చేస్తానన్నారు. జిల్లాలోని అన్ని ప్రాజెక్టులను సందర్శిస్తానని, ప్రాజెక్టు పురోగతికి రాత్రింబవళ్లు శ్రమిస్తానని చెప్పారు.

పునరావాస కాలనీల్లో పూర్తి స్థాయి సదుపాయాలు..

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన నిర్వాసితుల కోసం నిర్మిస్తున్న పునరావాస కాలనీల్లో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలను వెంటనే కల్పించాలని అధికారులను ఆదేశించారు. బోడబండ, సున్నపుతండా, అంజనగిరితండా, ఒడ్డె గుడిసెలు, దుల్యానాయక్ తండా పునరావాస గ్రామాల్లో రహదారులు, ఇళ్లు, కరెంటు, డ్రైయినేజీ తదితర మౌలిక సదుపాయాలను పూర్తిచేయాలని చెప్పారు. కార్యక్రమంలో సీఈ విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎఈ సత్యానారాయణరెడ్డి, ఈఈలు శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, మురళి, శ్రీకాంత్, పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తి లిఫ్టు ద్వారా ప్రతి ఎకరాకు నీరు..

కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద వానాకాలంలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కల్వకుర్తి ఎత్తిపోతల మొదటి లిఫ్టు, పంప్‌హౌజ్‌ను పరిశీలించారు. నాలుగేళ్లుగా రిపేర్‌లో ఉన్న రెండు మోటార్లను మరమ్మతు చేయకపోవడంపై ఆరా తీశారు. ప్రాజెక్టు మొదటి పంపు వద్ద ఐదు పంపులకుగానూ మూడు పంపులే పని చేస్తున్నాయని చెప్పారు. గత ప్రభుత్వం ప్రాజెక్టు నిర్వహణను గాలికి వదిలేసిందన్నారు. త్వరగా మోటార్లను మరమ్మతు చేసి పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలన్నారు. ప్రాజెక్టు కాల్వలను పరిశీలించి వారం రోజుల్లోగా పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని సూచించారు. కాల్వల్లో పూడిక తీత, పిచ్చిమొక్కల తొలగింపునకు వేగంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఫీడర్ చానళ్ల నిర్వహణకు రైతులు సహకరించాలని కోరారు. ఎవరైనా కాల్వలను పూడ్చివేసేందుకు ప్రయత్నించే వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జీల్దార్ తిప్ప ప్రాజెక్టు కింద ఆయకట్టుకు నీరందించేందుకు ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. బాచారం వరకు కాల్వ ద్వారా నీరందించేందుకు సర్వే నిర్వహించి నివేదిక అందజేయాలని కోరారు. నార్లాపూర్ వద్ద పాలమూరు ప్రాజెక్టు పనులతో పాటు మిషన్ భగీరథ పంప్‌హౌస్, కంట్రోల్‌రూమును సందర్శించారు.

ఉద్యమంతోనే తెలంగాణ సాధ్యమైంది



ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డిని సన్మానిస్తున్న మర్రి జనార్దన్‌రెడ్డి, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు

- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

నాగర్‌కర్నూల్: లాఠీ దెబ్బలు తగులుతాయని తెలిసినా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నామని, దీంతో రాష్ట్రం సాధ్యమైందని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గెలిచిన నవీన్‌రెడ్డికి స్థానిక మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాపై కూడా కేసులు ఉన్నాయని, బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఎవరూ కేసులకు భయపడవద్దని ధైర్యం చెప్పారు. తన గెలుపు కోసం అహర్నిశలు శ్రమించిన పార్టీ నాయకత్వానికి ఎంపీటీసీలకు, కౌన్సిలర్స్‌కి, జెడ్పీటీసీ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు.

నాలా పాఠశాల భవనాలు కట్టండి: మాజీ ఎమ్మెల్యే మర్రి

మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఇటీవల నియోజకవర్గంలో జరిగిన పరిణామాలపై స్పందిస్తూ.. నేను నిర్మించిన పాఠశాలల బోర్డులపై, గోడలపై నా పేరు తీసివేయగలరు కానీ, ప్రజల గుండెల్లో నుంచి మాత్రం పేరు చెరపలేరని అన్నారు. మీకు దమ్ముంటే నా లాగా పాఠశాల భవనాలు కట్టి చూపించాలని స్థానిక ఎమ్మెల్యేను ఉద్దేశించి సవాల్ విసిరారు. నేను రూ.5 భోజనం పెడుతున్నా.. మీరు ఒక్క రూపాయికి భోజనం పెట్టండని అన్నారు. మీరు ఏదో ఉద్ధరిస్తారని ప్రజలు మిమ్మల్ని గెలిపించారు. ఇన్ని రోజులు మీకు సమయం ఇవ్వడం జరిగిందని, దాన్ని ఆసరాగా చేసుకొని అడ్డగోలుగా మా కార్యకర్తల జోలికి వస్తే ఊరుకోనని హెచ్చరించారు. తను తన ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన పాఠశాలపై రాజకీయం చేయడాన్ని ఖండించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నని రోజులు నాగర్‌కర్నూల్‌గా ఉండేదని, కేవలం ఏడు నెలల్లో కర్నూల్ మాదిరి ఫ్యాక్షన్ రాజకీయాలకు అడ్డాగా మార్చారని విమర్శించారు. అనంతరం డాక్టర్ ఆర్‌ఎస్. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతలు ఆందోళనకరంగా ఉన్నాయని, నాగర్‌కర్నూల్ జిల్లాలో దారుణంగా ఉన్నాయన్నారు. కళాశాలకి వెళ్లి కేవలం ఒక ఫొటో తీసుకొని వచ్చిన మర్రిజనార్దన్‌రెడ్డి పీఏ నర్సింహపై కూడా కక్ష కట్టారని అన్నారు. శ్రీధర్‌రెడ్డి హత్య కేసులో ఎలాంటి పురోగతి లేదు, దాడులు జరుగుతున్న స్పందిస్తాలేరని విమర్శించారు. ఈ సమయంలో పార్టీ కార్యకర్తలు అందరూ కలిసి కట్టుగా కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాగం శశిధర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

- నేషనల్ సెమినార్‌లో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



కార్యక్రమంలో భాగంగా సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రాష్ట్రంలో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'ఇంపాక్ట్ ఆఫ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ ఇన్ తెలంగాణ ఎకానమీ' అనే అంశంపై ఏర్పాటు చేసిన నేషనల్ సెమినార్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పాలమూరులో గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు డిగ్రీ చదివేందుకు జిల్లా కేంద్రానికి వస్తుంటారని, వారికి కేవలం డిగ్రీ చదవడంతో స్కిల్స్ డెవలప్ కావడం లేదన్నారు. అందుకోసం, ఉపాధి కూడా పూర్తిస్థాయిలో లభించడం లేదన్నారు. ప్రభుత్వం ప్రత్యేకంగా నైపుణ్య శిక్షణా కేంద్రాలు అందుబాటులోకి తీసుకురానుందన్నారు. పాఠశాలల బలోపేతంలో భాగంగా ఉపాధ్యాయులకు గతంలో ఎప్పుడూ లేని విధంగా పదోన్నతులు ఇచ్చామని, పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు, నోటుపుస్తకాలు ఇచ్చామన్నారు. పీయూలో లా, ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు, రూ.100 కోట్లు తీసుకొచ్చేందుకు కృషి చేశామన్నారు. పీయూ కంట్రోలర్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలతో పోటీ పడే విధంగా భారత్ ఎదిగిందని, ఇటీవల భారత్ వృద్ధి రేటు బాగా పెరిగిందన్నారు. ఆర్థికంగా బలోపేతం కావడానికి ముఖ్య కారణం నేటితరం యువతనే అన్నారు. ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, సుధాకర్ రెడ్డి, నాగలక్ష్మి, ఉషా, లక్ష్మి పాల్గొన్నారు.

ప్రణాళిక బద్ధంగా చదివితే విజయం

- పీయూ స్టడీసర్కిల్ ఆధ్వర్యంలో పోటీపరీక్షలపై సదస్సు



సదస్సులో విద్యార్థులతో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి


మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పోటీ పరీక్షల్లో విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివితే విజయం లభిస్తుందని పీయూ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు పీయూలో విద్యార్థులకు స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వం పెద్దఎత్తున నోటిఫికేషన్లు వేస్తున్న నేపథ్యంలో ఉద్యోగాలను అందిపుచ్చుకొనేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలన్నారు. ఏ యూనివర్సిటీలో లేని విధంగా పీయూలో విద్యార్థులకు ప్రత్యేకంగా స్టడీ సర్కిల్‌ను ఏర్పాటు చేసి తరగతులు బోధిస్తున్నామని, ఇక్కడ శిక్షణ తీసుకున్న అనేక మంది ఇటీవలి ఉద్యోగాలు సాధించడం గొప్ప విషయమన్నారు. ముఖ్యంగా లైబ్రెరీ, కంప్యూటర్ ల్యాబ్ వంటి వాటిని పూర్తిస్థాయిలో వినియోగించుకుని జీవితంలో ఉద్యోగం సాధించాలన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న క్రమంలో సమయపాలన, నాణ్యమైన మెటీరియల్‌ను ఎంపిక చేసుకుని చదివితే, సులువుగా ఉద్యోగం పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, స్టడీ సర్కిల్ డైరెక్టర్ భూమయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బోధన వైద్యుల ఆందోళన

పాలమూరు: జిల్లా జనరల్ ఆస్పత్రిలో పాలమూరు మెడికల్ కళాశాల, జనరల్ ఆస్పత్రి బోధన వైద్యుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. నల్గొండ కలెక్టర్ జనరల్ ఆస్పత్రిలో పనిచేసే వైద్యుల రోజువారీ హాజరు పట్టిక, ఆస్పత్రిని పర్యవేక్షించడానికి రోజుకు ఒక జిల్లా అధికారికి విధులు కేటాయిస్తూ ఇచ్చిన ఆర్డర్‌పై.. నల్లబ్యాడ్జీలు ధరించి కార్యక్రమం చేపట్టారు. సంఘం అధ్యక్షుడు కిరణ్‌ప్రకాష్ ఇప్పటికే వైద్యులను పర్యవేక్షించడానికి సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్, డీఎంఈ, ఎన్‌ఎంసీ వ్యవస్థ ఉందన్నారు. కలెక్టర్ చర్య ఆ వ్యవస్థను, వైద్యులను కించపరిచే విధంగా ఉందన్నారు. కొన్నేళ్లుగా బదిలీలు లేక రూరల్ కళాశాలలో అలవెన్స్ లేక, ఏరియర్ బిల్స్, మెడికల్ బిల్స్ లేక తీవ్ర నిరాశలో ఉన్న మెడికల్ కళాశాల వైద్యులకు కలెక్టర్ చర్య పుండుమీద కారం చల్లినట్లుగా మారిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఇలాంటి ఘటనలు భవిష్యత్‌లో జరగకుండా చూడాలన్నారు.

జూరాలకు పూర్తిగా తగ్గిన ఇన్‌ఫ్లో

- నిలిచిన నెట్టెంపాడు ఎత్తిపోతల నీటి పంపింగ్



ధరూరు: నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా లిఫ్టు-1 గుడ్డెందొడ్డి వద్ద కొనసాగుతున్న నీటి పంపింగ్ శుక్రవారం నిలిపివేసినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. జూరాలకు ఇన్‌ఫ్లో పూర్తిగా తగ్గడంతో చర్యలు చేపట్టినట్లు వివరించారు. శుక్రవారం ప్రాజెక్టుకు కేవలం 449 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు పేర్కొన్నారు. ఆవిరి రూపంలో 134 క్యూసెక్కులు, కోయిల్ సాగర్‌కు 315 క్యూసెక్కులు మొత్తం ప్రాజెక్టు నుంచి 449 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు వివరించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రాజెక్టులో 7.971 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వివరించారు.

రామన్‌పాడులో తగ్గుతున్న నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో నీటి మట్టం తగ్గుతోంది. శుక్రవారం నాటికి పూర్తి స్థాయి నీటి మట్టం 1012 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడుమ కాలువ ద్వారా 27 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపి వేశారు. తాగునీటి అవసరాలకోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ రనీల్ రెడ్డి తెలిపారు.

కొండారెడ్డిపల్లిలో కాంగ్రెస్‌కే ఆధిక్యం



అచ్చంపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

- కాదని నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా
- ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

అచ్చంపేట: సీఎం సొంత గ్రామంలో బీజేపీకి ఎక్కువ ఓట్లు వచ్చాయని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్‌రావు అసత్య ఆరోపణలు చేయడం అర్థరహితమని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం అచ్చంపేట అంబేడ్కర్ ప్రజాభవనంలో విలేకరులతో మాట్లాడారు. కొండారెడ్డిపల్లిలో కాంగ్రెస్‌కే మెజార్టీ వచ్చిందన్నారు. బీజేపీకి వచ్చినట్లు మాజీ మంత్రి నిరూపిస్తే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని, లేదంటే ఆయన రాజకీయ సన్యాసం చేయడానికి సిద్ధంగా ఉండాలని సవాలు విసిరారు. ఈ సందర్భంగా ఎన్నికల కమిషన్ విడుదల చేసిన బూత్ వారీ ఓట్ల వివరాలు చూపించారు. మొత్తంగా కాంగ్రెస్‌కు 983 ఓట్ల మెజార్టీ వచ్చిందన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా మాజీ ఎమ్మెల్యే మాటలు పట్టుకుని మాట్లాడటం సరికాదన్నారు. మాజీ మంత్రి తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి సీఎం కావడం చూసి ఓర్వలేకనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్ ఏకమై.. ఓట్లను బీజేపీకి బదలాయించారని ఆరోపించారు. బలహీనమైన అభ్యర్థులను బరిలో నిలిపి బీజేపీ గెలుపునకు పరోక్షంగా మద్దతు తెలిపారని దుయ్యబట్టారు. మామ, అల్లుళ్ల ఇలాకలో బీఆర్‌ఎస్‌కు మూడో స్థానం ఎందుకు వచ్చిందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మరో రెండునెలల్లో హరీశ్‌రావు బీజేపీలోకి వెళ్లడం ఖాయమన్నారు. జెడ్పీటీసీ మంత్ర్యానాయక్, కట్టా అనంతరెడ్డి, వెంకట్‌రెడ్డి, నారాయణగౌడ్, పండిత్‌రావు, రామనాథం, ప్రతాప్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ అసిస్టెంట్ ఖాళీల పదోన్నతులు చేపట్టాలి

- ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి



మాట్లాడుతున్న పర్వత్‌రెడ్డి

అచ్చంపేట : ఒక ఉపాధ్యాయుడికి ఒకటి కంటే ఎక్కువ పదోన్నతి ఉత్తర్వులు జారీ కావడంతో అనివార్యంగా మిగిలిపోయిన స్కూల్ అసిస్టెంట్ ఖాళీలకు పదోన్నతులు చేపట్టాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు యం.పర్వత్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తొమ్మిదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులపై ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటిందని, ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రాథమిక హెచ్‌ఎం పోస్టులను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం నెలనెలా పదోన్నతులు, ఏడాదికోసారి బదిలీలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గత ప్రభుత్వం 5,571 ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయ పోస్టుల మంజూరుకు హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం తప్పకుండా ఇట్టి విషయంలో సానుకూలంగా స్పందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించి, పాఠశాల విద్యాశాఖలో అన్ని రకాల పర్యవేక్షణాధికారి పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని కోరారు. పాఠశాలలకు అవసరమైన విద్యావలంటీర్లను, పారిశుద్ధ్య సిబ్బందిని నియమించాలని కోరారు. ఈ-కుబేర్‌లో పెండింగులో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్, సతీష్, అర్జునయ్య, హరిప్రసాద్, శ్రీధర్‌రావు, గజేందర్, వెంకటేశ్వర్‌రావు, బాల్‌నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- బంగారు, నగదు దొంగతనం



బీరువాలోంచి చిందరవందరగా పడేసిన దుస్తులు

కొత్తకోట రూరల్: తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణ కేంద్రంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి కథనం ప్రకారం.. పట్టణ కేంద్రంలోని విద్యానగర్ కాలనీకి చెందిన మందడి శ్రీనివాసులు పండ్లవ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గురువారం హైదరాబాద్‌లోని తన మనుమడి పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనేందుకు భార్య, కుమారుడు, చిన్న కుమార్తెతో కలిసి వెళ్లాడు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున వారి ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో పక్కింటి వారు గమనించి దొంగతనం జరిగిందని ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. దీంతో వెంటనే హైదరాబాద్ నుంచి కొత్తకోటకు చేరుకున్న కుటుంబసభ్యులు.. ఇంట్లో చిందరవందరగా పడిన దుస్తులు, బీరువా తలుపులు పగులగొట్టి ఉండటం చూసి పోలీసులకు సమాచారం అందించారు. బీరువాలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసు, 30 తులాల వెండి ఆభరణాలు, రూ.1500నగదు చోరీకి గురైందన్నారు. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి సిబ్బందితో వెళ్లి ఘటన స్థలాన్ని పరిశీలించారు. వనపర్తి నుంచి క్లూస్ టీంను పిలిపించి దొంగతనం జరిగిన తీరును పరిశీలించి ఆధారాలు సేకరించారు.